

ఆరోగ్యానికి 'ఆసరా'

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందిన వారికి ప్రభుత్వం ఆసరా ద్వారా జీవనభృతి అందిస్తోంది.

- 8లో



కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్

చిత్తూరులో ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. కమిషనర్ అరుణ తనిఖీలు చేపట్టారు.

- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
చిత్తూరు	6.29	4.58
పుంగనూరు	6.31	5.01

న్యూస్‌రీల్

వేలం పాటల ఆదాయం రూ.5.39 కోట్లు



వేలం పాటల వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ వేలం పాటల ద్వారా రూ.5.39 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించామన్నారు. దేవస్థానం టోల్ గేటు నిర్వహణను రూ.65 లక్షలతో భవానీ నగర్‌కు చెందిన రఘుపతినాయుడు దక్కించుకున్నట్లు వెల్లడించారు. పెద్దబోగం, చిన్న బోగం సేకరణను రూ.82.03 లక్షలతో కె.రమణ, తలనీలాలు సేకరణను రూ.38.01 లక్షలతో కొలింపల్లెకు చెందిన గంగిరెడ్డి సొంతం చేసుకున్నారని తెలిపారు. అలాగే కొండ కింద క్యాంటీన్, ఐస్‌క్రీం, కూల్‌డ్రింక్ విక్రయాలను రూ.6.01 లక్షలతో గంగాపురానికి చెందిన సురేష్, కోళ్ల విక్రయాలను రూ.6.43 లక్షలతో ప్రసాద్, పాదరక్షల భద్రపరుచడాన్ని రూ.4.76 లక్షలతో గౌతమ్, కొబ్బరి చిప్పల సేకరణను రూ.7.05 లక్షలతో నరసింహులు దక్కించుకున్నారని వివరించారు. ఈ మేరకు ఫిబ్రవరి 7వ తేదీన వేలం పాటల ద్వారా రూ.2.28 కోట్లు, 8న రూ.1.01 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అప్పుడు వాయిదా పడిన కొన్ని వేలం పాటలకు ఇప్పుడు రూ.2.09 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

పరిశోధన రంగానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : పరిశోధన రంగానికి ప్రాధాన్యం పెరిగిందని, ఈ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం కళాశాలలో 'పదార్థ విజ్ఞాన శాస్త్రంలో ఇటీవలి ఆవిష్కరణలు, పురోగతులు' అనే అంశం మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధన రంగం వైపు చేయాలన్సిన కృషిని వివరించారు. భౌతిక శాస్త్రం ఆచార్యులు డాక్టర్ బీయన్ రెడ్డి మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ సింథసిస్ ఆఫ్ నానో మెటీరియల్స్ ఫర్ వేరియస్ అప్లికేషన్స్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వీయూ ఆచార్య కేటీ రామకృష్ణ, మాజీ రెక్టార్ డాక్టర్ సీకే జయశంకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆర్జేడీ డాక్టర్ పి.బాబు, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బి.రమేష్ పాల్గొన్నారు.

ఇరువురి గొడవకు రాజకీయ రంగు

– టీడీపీ నేతల అసత్య ప్రచారం

చిత్తూరు అర్బన్: నగరంలోని మురకంబట్టు వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు టీడీపీ నేతలు రాజకీయ రంగు పులిమారు. గాయపడింది తమ పార్టీకి చెందిన వ్యక్తని, దాడి చేసింది వైఎస్సార్‌సీపీ నాయకుడని అసత్య ప్రచారానికి తెరతీశారు. వివరాలు.. మురకంబట్టుకు చెందిన ఆటో డ్రైవర్ మురుగేష్, ఫొటో స్టూడియో నడుపుతున్న నవీన్‌కు పాత గొడవలు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం మురుగేష్ ఆటో పార్కింగ్ చేస్తున్న సమయంలో నవీన్ అడ్డుకుని వాగ్వాదానికి దిగాడు. గొడవ పెరగడంతో నవీన్ బీరు బాటిల్‌తో మురుగేష్‌పై దాడి చేశాడు. దీంతో మురుగేష్ తలపై నాలుగు కుట్లు కూడా పడ్డాయి. ఇదే ఘటనలో మురుగేష్ కూడా నవీన్‌ను కొట్టాడు. ఈ ఘటనపై తాలూకాపోలీసులు విచారిస్తున్నారు. అయితే ఇద్దరి మధ్య గొడవను చిత్తూరుకు చెందిన టీడీపీ నేతలు రాజకీయరంగులు అద్ది .. తమ పార్టీలో చేరుతుంటే, వైఎస్సార్‌సీపీ వాళ్లు కొడుతున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడంపై స్థానికులు నవ్వుకోవడం గమనార్హం.



"నా రాజకీయ అనుభవమంత లేదు ఇతని వయసు.. అలాంటిది నాపైనే నిఘా పెడతాడా..? నేను ఎవరితో మాట్లాడుతున్నా.. ఏం చేస్తున్నా..? అని ఆరాలు తీస్తాడా..?"
ఓ టీడీపీ నాయకుడి ఆగ్రహం.

"అన్నా.. నీ ఒక్కడిపైనే కాదు.. నేనేదో ఆయన నుంచి డబ్బులు ఆశిస్తున్నట్లు నన్నూ అనుమానిస్తున్నాడు..! నన్ను జనం ఎప్పుడో మర్చిపోయారని నా వాళ్లతోనే వ్యాఖ్యానిస్తున్నాడు..! ఇక గమ్మున్గా ఉంటే లాభం లేదు. మనమేంటో చూపిస్తే కానీ, అతడికి అసలు సంగతి అర్థం కాదు"
మరో నేత మనో వేదన..

ఇవి చిత్తూరులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు (జీజేఎం)పై సొంత పార్టీకి చెందిన వారు ఓ నాయకుడి ఇంట్లో నిర్వహించిన రహస్య సమావేశంలో మాట్లాడుకున్న మాటలు అని ప్రచారం సాగుతోంది..? పార్టీలోని సీనియర్లను, మాజీలను జీజేఎం నమ్మడం లేదా..? ఇది గ్రహించిన అసమ్మతీయులు ఇటీవల ఓ సీనియర్ నాయకుడి ఇంట్లో సమావేశమయ్యారా..? తమను లెక్కచేయని వ్యక్తికి తగిన గుణపాఠం నేర్పాలని కంకణం కట్టుకున్నారా..? ఈ ప్రశ్నలకు జీజేఎం అనుచరులు అవుననే సమాధానం చెబుతున్నారు. రాజకీయాలకు దూరమై ఏళ్లు గడిచిపోయిన మాజీ నేతలను జీజేఎం పక్కకు పెట్టేసినట్టు తెలుస్తోంది. వీళ్ల పనితీరుపై తాను తెప్పించుకున్న సర్వే నివేదికలే ఇందుకు కారణమని సమాచారం. ఈ విషయం పసిగట్టిన అసమ్మతివర్గం పక్కనే నమ్మకంగా ఉంటూ నట్టేట్లో ముంచాలని తీర్మానించినట్లు తెలిసింది.

- చిత్తూరు టీడీపీలో వర్గపోరు
- మాజీలు.. పెద్దలపై నిఘా పెట్టిన గురజాల?
- నేతలను పక్కనపెట్టి.. సొంత అజెండా
- అనుమానంతో అవమానించడంపై సీనియర్ల ఆగ్రహం
- తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్న నాయకులు


ఎత్తులు.. కడుపులో కత్తులు!

చిత్తూరు అర్బన్ : చిత్తూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపుపై ధీమాగా ఉన్నారు. ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధైర్యంగా ఉన్నారు. కానీ టీడీపీలో పరిస్థితి అలాకాదు. ఎవరో, ఏమిటో తెలియకుండా ఎవరెవరినో తీసుకొచ్చి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇదే దారిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు పచ్చ కండువాలు కప్పుకుంటే.. ఈ పార్టీ పొత్తుపెట్టుకున్న జనసేనలో సిట్టింగ్ ఎమ్మెల్యే చేరిపోయారు. పైగా ఎమ్మెల్సీ, మేయర్‌తో పాటు ఇతర నామినేటెడ్ పోస్టులు అనుభవించిన సీనియర్లు తన వెంటే ఉంటూ గెలుపునకు కృషి చేస్తారని ఇన్నాళ్లు జీజేఎం వీళ్లపై నమ్మకం పెట్టుకున్నాడు. కానీ ఇప్పుడు తన నీడను తప్ప ఎవ్వరినీ నమ్మే పరిస్థితిలో లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు, పార్టీలోకి వచ్చే ప్రతీ ఒక్కరికీ పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పాలని తనపై ఒత్తిడి తెస్తున్నట్లు తీవ్ర అసహనానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తనతో పాటు ఉన్న నేతల సత్తా ఏమిటో తెలుసుకోవాలని వాళ్లను చూసి ఓట్లేసేవాళ్లు ఎంత మంది ఉన్నారు..? ఎన్నిచోట్ల ప్రభావితం చేస్తారు..? అసలు ఆ నేతలతో పాటు వచ్చే అనుచరగణం ఎంత..? లాంటి విషయాలు తెలుసుకోవడానికి కూడానే ఉంటున్న పలువురి నుంచి విషయాలు రాబట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

జనసైనికుల లొల్లి

ఇదికాదన్నట్లు జనసేన పార్టీ నేతలు సైతం చిత్తూరులో తన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జీజేఎంకు సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది. జనసేనలోని ఓ వ్యక్తిని రెబల్‌గా నామినేషన్ వేయించనున్నట్లు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఆ పార్టీ నాయకులు పోస్టులు పెడుతున్నారు. ఇది కూడా చిల్లర కోసమేనంటూ జీజేఎం గుర్తించాడు. వీళ్లతో పాటు కమలంలోని వ్యక్తులతో పెద్దగా ఉపయోగం లేదని తన అనుచరుల వద్ద వాపోయినట్లు తెలిసింది. కేవలం తన నుంచి వచ్చినకాడికి నోట్లు రాల్చుకుందామనే ప్రతీ ఒక్కరూ క్యూ కడుతున్నారని టీడీపీ అభ్యర్థి నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

పక్కనే ఉంటూ..



రైలు.. పట్టాలు ఎక్కకున్నా, రాజకీయ నాయకుడు జనం మధ్య లేకుండా గ్యాప్ తీసుకున్నా మరచిపోవడం మామూలే. ఒక్కసారి మరచిపోయిన వ్యక్తిని మళ్లీ జనం నమ్మే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం జీజేఎం తన సొంత పార్టీ నేతలపై నిఘా ఉంచి తెప్పించుకున్న సారాంశం ఇదేనని జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో పార్టీలోని పలువురు సీనియర్లు చిత్తూరు నగరంలోని ఓ ప్రధాన నాయకుడి ఇంట్లో రెండు రోజుల క్రితం సమావేశమయినట్లు తెలిసింది. ఈ మీటింగ్‌కు తన అనుచరులను పంపిన జీజేఎం పూర్తి సమాచారం తెలుసుకున్నట్లు సదరు నేతలు కనిపెట్టేశారు. తమపైనే నిఘా పెట్టడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. టికెట్ కోసం చివరి నిముషం వరకు ప్రయత్నించి, పార్టీ అధిష్టానం మొండిచేయి చూపినా భరించి అభ్యర్థి వెంట నడుస్తుంటే తమపైనే నిఘా పెట్టడం ఎంత వరకు న్యాయమని ఆవేదన వెళ్లగక్కినట్లు సమాచారం. ఇలా ప్రతి ఒక్కరినీ అనుమానించే వ్యక్తికి వెనకే ఉంటూ వెన్నుపోటు పొడిస్తే ఎలా ఉంటుందో చూపించాలని పచ్చ పెద్దలంతా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో ఓ ఆసక్తికర అంశం ఏంటంటే.. అసమ్మతి నేతల రహస్య సమావేశంలో చర్చించిన పలు విషయాలను సైతం జీజేఎం తెప్పించుకున్నట్లు తెలిసింది. తనతోనే ఉంటూ వెన్నుపోటు పొడవాలని చూస్తున్న సొంత పార్టీ నేతలను గుర్తించి, వారిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు జీజేఎం ఎన్నికల ప్రచారాలు, సమావేశాల్లో పాల్గొంటున్న నేతలు ఎవరెవరితో మాట్లాడుతున్నారు..? ఎవర్ని కలుస్తున్నారో తెలుసుకోవడానికి జీతాలు ఇచ్చి మరి ఓ బృందాన్ని నియమించినట్లు తెలుస్తోంది. చిత్తూరులో పార్టీ ఏమైనా పర్లేదు.. తమ ఉనికికి ప్రమాదం రాకుండా చూసుకోవడానికి ఎవ్వరికైనా వెన్నుపోటు పొడవడానికి అలవాటు పడ్డ పెద్దల కత్తులు ఈసారి జీజేఎంను లక్ష్యంగా చేసుకున్నాయి. విషయం తెలిసి కూడా సొంతపార్టీలోని అనుకూల శత్రువులతో వేదికలు పంచుకుంటున్న అభ్యర్థి పైకి నవ్వుతూ కనిపిస్తున్నా.. తాను నమ్మే ఓ యువ నాయకుడి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం.

బాధ్యతగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నోడల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సార్వతిక ఎన్నికలకు సంబంధించి 24 విభాగాలకు నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. వారికి సహాయక సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. ఎన్నికలు ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు అడిగే సమాచారం, రిపోర్టులను వెంటనే అందజేయాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చిజేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా కసరత్తు

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కసరత్తును పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. 16వ తేదీన షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పక్కాగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు తొలగించినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు ఉదయ్ కుమార్, అట్లూరి శ్రీనివాసులు, భాస్కర్, గంగరాజు, పరదేశి, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రోత్సాహం.. నేతన్న సంతోషం



మంత్రి రోజా చేతుల మీదుగా మెగా చెక్ అందుకుంటున్న నేత సామాజివర్గం నేతలు

నగరి : మరమగ్గ నేత కార్మికులను మంత్రి రోజా ప్రోత్సహిస్తూ అండగా నిలిచినందుకు పలువురు కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్ ఆర్డర్లకు సంబంధించి రూ.3.32 కోట్ల బకాయిలను ఈ నెల 13వ తేదీన తమ ఖాతాలకు జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి చేతుల మీదుగా మెగా చెక్కు అందుకున్నారు. మంత్రిని ఘనంగా సత్కరించారు. నేత కార్మికులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఆర్డర్లు లేక అవస్థల పాలైన నేతపరిశ్రమను ఆదుకోవాలన్న సంకల్పంతో యూనిఫామ్ ఆర్డర్‌ను మంత్రి రోజా ఇప్పించారన్నారు. మొత్తం రూ.10.72 కోట్ల ఆర్డర్‌లో తొలివిడతగా రూ.7.81 కోట్లు, రెండో విడతలో, రూ.2.91 కోట్లు వచ్చాయని, పెండింగ్ నగదు ఇప్పుడు చేతికందిందని వివరించారు. నేత కార్మికులకు మంత్రి రోజా ఎల్లప్పుడూ అండగా నిలిచారని, ఈటీపీని నిర్వహణలోకి తెచ్చారన్నారు. విద్యుత్ బిల్లులు పెరిగిన సమయంలో ముఖ్యమంత్రి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లి 50 శాతం సబ్సిడీని కొనసాగిస్తూనే అడిషనల్ చార్జీలు యూనిట్‌కు 94 పైసలు తగ్గించారని వెల్లడించారు. నేత సామాజిక వర్గం కోడలు కనుకే మాపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపుతున్నారన్నారు. దీనిపై మంత్రి రోజా మాట్లాడుతూ నేతన్నలకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు మరమగ్గాలకు ఇవ్వని ఆర్డర్లు తీసివ్వడంలో తను ఏమేరకు పోరాటం చేశానో తనతో పాటు వచ్చిన నేతన్నలకు తెలుసని, మాయమాటలు చెప్పి ఏమార్చే ధోరణి తనది కాదన్నారు. రాబోయే కాలంలో ముందస్తు అడ్వాన్సుతో ఆర్డర్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పరిశ్రమ స్థిరంగా నిలదొక్కుకోవాలని, ఉజ్వలమైన భవిష్యత్తును నేత కార్మికులకు అందించాలన్న దృక్పథంతోనే తాను పనిచేస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి పాల్గొన్నారు.

'రావూరి' చేరిక హర్షణీయం



విజయానందరెడ్డికి సంఘీభావం తెలుపుతున్న రావూరి ఈశ్వరరావు

చిత్తూరు రూరల్ : వైఎస్సార్‌సీపీలో రావూరి ఈశ్వరరావు చేరిక హర్షణీయమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గురునగర్ కాలనీలో రావూరిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా ఎదిగి..టీడీపీకి రక్తం ధారబోసిన రావూరి ఈశ్వరరావును కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక కార్యకర్తలందరికీ ఈశ్వరరావు ఆదర్శమని కొనియాడారు. తన సొంత నిధులతో పేదలకు, ఆటోవాళ్లకు పింఛను, బియ్యం, దుస్తులు ఇచ్చిన ఘనత రావూరి ఈశ్వరరావుకు దక్కుతుందన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడికి టీడీపీలో పదవులు రాకపోగా, కనీస విలువ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇకపై రావూరిని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడిగా చూసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో రావూరి సేవలను సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, చిత్తూరు టౌన్ బ్యాంక్ చైర్మన్ రామ్ గణేష్, నాయకులు కట్టమంచి శేఖర్, కుమారస్వామిరెడ్డి, అన్బు, శిరీష్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండలంలోని ఎస్.బండపల్లె పంచాయతీ బెల్లకుంట గ్రామంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం వారికి ఎమ్మెల్యే వెంకటేగౌడ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గంగులప్ప, శంకరప్ప, సుబ్రమణ్యం, సుధమ్మ, విజయమ్మ, రత్నప్ప, శీనప్ప, నారాయణప్ప, అశోక్ కుమార్, గిరిజమ్మ, మంజునాథ్, విజయ్‌కుమార్, పెసలదొడ్డి, శంకరప్ప, దొరస్వామి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు పాల్గొన్నారు.

150 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల శిక్షణ కార్యక్రమాలకు హాజరుకాని 150 మంది పీఓ (ప్రిసైడింగ్ ఆఫీసర్), ఏపీఓ (అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్)లకు షోకాజ్ నోటీసులు జారీచేయనున్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన పీఓ, ఏపీఓలు తప్పనిసరిగా శిక్షణలకు హాజరవ్వాలని ఇది వరకే ఉన్నతాధికారులు పలుమార్లు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ 150 మంది పీఓ, ఏపీఓలు శిక్షణకు హాజరుకాకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు కలెక్టరేట్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 21,156 మంది విద్యార్థుల హాజరు



చిత్తూరులోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొత్తం 116 కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. తొలిరోజు తెలుగు పేపర్ పరీక్ష జరిగింది. 21,757 మంది విద్యార్థులకు గాను 21,156 మంది హాజరయ్యారు. 601 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల లోపు విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్ష నిర్వహణకు 116 మంది చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 1,096 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పక్కాగా 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లను చూపించి ఆర్టీసు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. డీఈఓ దేవరాజు చిత్తూరులోని 7 కేంద్రాలను, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చౌడేశ్వరి 1, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 39 మొత్తం 47 పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 209 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఓపెన్ స్కూల్ పరీక్షలకు 209 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ దేవరాజు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు నిర్వహించిన పది, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు 4,714 మంది అభ్యర్థులకు గాను 4505 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు.



డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేద రోగులకు వరంగా మారింది. ఆరోగ్య రక్షణతోపాటు ఆర్థికంగానూ ఆదుకుంటోంది. చికిత్స పొందిన తర్వాత పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం 'ఆసరా'గా నిలుస్తోంది. రోగికి ఎంతకాలం విశ్రాంతి అవసరం అవుతుందో ఆ మేరకు జీవనభృతిని సైతం అందిస్తోంది. కుటుంబ పోషణకు ఇబ్బంది పడకుండా రోజుకు రూ.225 చొప్పున నెలకు గరిష్టంగా రూ.5వేలు అందజేస్తోంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రోజే చెల్లిస్తోంది. పారదర్శకంగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తోంది.




గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యులు

ఆరోగ్యానికి ఆసరా

- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద రోగులకు ఉచితంగా చికిత్స
- కోలుకునే వరకు జీవనోపాధికి భృతి
- రోజుకు రూ. 225 లెక్కన నెలకు రూ.5వేలు
- డిశ్చార్ రోజునే లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు నగదు జమ

చిత్తూరు రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో తొలుత 1059 వ్యాధులను చేర్చారు. తర్వాత దశల వారీగా మరికొన్ని వ్యాధులకు సైతం చికిత్స పొందే వెసులుబాటు కల్పించారు. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు విశిష్టమైన ఆరోగ్య శ్రీ పథకాన్ని పూర్తిగా నీరుగార్చేశాయి. ఈ క్రమంలో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి పునరుజ్జీవం పోసింది. ప్రస్తుతం 3,255 వ్యాధులకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టింది. పథకం పరిమితిని సైతం రూ.25లక్షలకు పెంచింది. అయితే ఇప్పటి వరకు ఆరోగ్య శ్రీ కింద చికిత్స మాత్రమే పొందే అవకాశం ఉండేది. దీనిపై ఉన్నతంగా ఆలోచించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకం కింద చికిత్సపొందినవారు కోలుకునే వరకు ఆసరాగా నిలబడాలని సంకల్పించారు. ఈ మేరకు రోగి కోలుకునే వరకు జీవనభృతి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. రోవైఎస్సార్ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న రోగికి ఆసరా కింద రోజుకు రూ. 225 నుంచి నెలకు గరిష్టంగా రూ. 5 వేలు అందిస్తున్నారు. రోగి లేదా వారి బంధువుల బ్యాంకు ఖాతాలో రోగి డిశ్చార్జి అయిన రోజునే నగదు జమ చేస్తున్నారు. నెలల తరబడి మంచానికే పరిమితమైన రోగులను ఆసరా ఆదుకుంటోంది.

జవాబుదారీతనానికి ప్రాధాన్యం

ఆరోగ్యశ్రీ సేవల్లో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న తర్వాత రోగి తప్పనిసరిగా అభిప్రాయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేయాలి. ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ ఎలా ఉంది, వైద్యులు ఎలా సేవలందించారు, మందులు, ఆహారం ఎలా ఉన్నాయన్న అంశాలపై రోగి కన్సర్మేషన్ లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ఆస్పత్రికి బిల్లు చెల్లిస్తారు. అలాగే, వారం రోజుల తర్వాత సమీపంలోని ఆరోగ్యమిత్ర, ఏఎన్ఎం వచ్చి ఆరోగి ఆరోగ్యంపై ఆరా తీస్తారు. రోగి ఇచ్చిన సమాధానంపైనే ఆస్పత్రి బిల్లు చెల్లింపులు ఆధారపడి ఉంటాయి.

జిల్లా సమాచారం

మొత్తం ఆరోగ్య శ్రీ కార్డులు	4,73,877
నెట్‌వర్క్ ఆస్పత్రులు	73
డెంటల్ హాస్పిటళ్లు	07
పథకం పరిధిలోని వ్యాధులు	3,255
ఐదేళ్లలో చేసిన శస్త్ర చికిత్సలు	3,52,773
వెచ్చించిన మొత్తం	రూ.152.18 కోట్లు

ఆరోగ్యశ్రీ ఆసరా లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	సర్జరీల సంఖ్య	జమ చేసిన మొత్తం రూ.కోట్లలో
2019-20	43,898	3.62
2020-21	51,173	90.01
2021-22	75,941	13.99
2022-23	83,816	20.01
2023-24	97,945	24.55

రూపాయి ఖర్చు లేకుండా



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చాం. రూపాయి ఖర్చు లేకుండా సుఖ ప్రసవం చేశారు. మంచిగా చూసుకున్నారు. ఆరోగ్య మిత్ర దగ్గరుండి ఆరోగ్య శ్రీ, ఆసరా సేవలు అందించారు. డిశ్చార్ అయినా వెంటనే ఆరోగ్య శ్రీ ఆసరా రూ.5 వేలు మా బ్యాంకు ఖాతాకు జమైంది. ఉచితంగా వైద్యం చేసి...జీవనోపాధికి భృతి కూడా ఇచ్చారు.

– సాహినా, లెనిన్ నగర్, చిత్తూరు

రూ. 10వేలు ఇచ్చారు...



నేను బోయకొండ ఆలయంలో పూజారిని. నలగంపల్లె వద్ద రెండు నెలలకు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాను. తొలుత చేయి, మళ్లీ ఇప్పుడు కాళ్లకు ఆపరేషన్ చేశారు. రెండు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా. ఇంటి ఖర్చులు, మందులు కొనుగోలుకు ఎలా అని ఆలోచించేవాడిని. ఆ సమయంలో ఆరోగ్య మిత్ర వచ్చి ఆరోగ్య ఆసరాకు దరఖాస్తు తీసుకున్నారు. డిశ్చార్జ్ అయ్యే రోజు రెండు నెలలకు గాను రూ. 10 వేలను గే నా బ్యాంకు ఖాతాలో వేశారు.

– మొగిలప్ప, తవణంపల్లె

ఆర్థికంగా ఆదుకున్నారు



చిత్తూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆరోగ్య శ్రీ పథకం కింద నా కాలుకు ఆపరేషన్ చేశారు. ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ఈ చికిత్సగా అయిన ఖర్చు రూ.61,571 పూర్తిగా ప్రభుత్వమే భరించింది. చికిత్స తర్వాత వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఆ సమయానికి ఆరోగ్య ఆసరా భృతి కింద నా బ్యాంక్ ఖాతాలోకి రూ.1,575 జమ చేసి ఆర్థికంగా ఆదుకున్నారు.

– గణపతి, దివిటివారిపల్లె, ఐరాల

టీడీపీ నేతల దాడిపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు ఇస్తున్న మేస్త్రీ సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు : పట్టణంలో టీడీపీ నేతల దాడులపై వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పోలీసులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. చింతలగుంట వద్ద చిల్డ్రన్స్ పార్క్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతుండగా టీడీపీ నాయకుడు షణ్ముగరెడ్డి అతడి అనుచరుడు నవీన్ అక్కడికి వచ్చి కొలతలు, ఫొటోలు తీశారు. దీనిపై ప్రశ్నించిన తాపీ మేస్త్రీ సునీల్‌ను కులం పేరుతో దూషించి, రాయితో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిని కౌన్సిలర్ చిట్టిబాబు అడ్డుకోవడంతో ఆయనపై సైతం దాడికి దిగారు. బాధితులతో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, సచివాలయాల కన్వీనర్ ఏకాంబరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ హరి మీడియాతో మాట్లాడుతూ 23వ వార్డులో జనవరి 27వ తేదీన మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా చిల్డ్రన్స్ పార్క్ కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. జనరల్ ఫండ్స్ రూ.24 లక్షలతో మూడు నెలలుగా జరుగుతున్న పనులను అడ్డుకునేందుకు ముందస్తు పథకం ప్రకారమే దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. తమ పార్టీ వారిని గాయపరచడమే కాకుండా మళ్లీ తమపైనే తప్పుడు ఫిర్యాదు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తే టీడీపీకి ఓట్లు పడవని, మంచి పనులు చేసి ప్రజల మనసు గెలుచుకొంటే ఓట్లు వస్తాయని హితవు పలికారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మహేష్ (ఫైల్)

బైరెడ్డిపల్లె : మండలంలోని గడ్డూరులో సోమవారం మధ్యాహ్నం ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. వివరాలు.. గడ్డూరు గ్రామానికి చెందిన జయప్ప కుమారుడు మహేష్ (15) కమ్మనపల్లె మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పరీక్షకు హాజరై ఇంటికి చేరుకున్నాడు. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బావిలో మునిగిపోయి మరణించాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. జయప్పకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. మహేష్ మరణవార్త విని తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

'నవరత్న' లోగో ధ్వంసంపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలోని శెట్టేరి గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనానికి ఏర్పాటు చేసిన నవరత్న పథకాలకు సంబంధించిన 'లోగో' ధ్వంసంపై కాంట్రాక్టరు మార్కొండయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేశారు. భవనానికి నవరత్న పథకాలను తెలియజేస్తూ ఉండే లోగో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో అమర్చారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ముఖ్యమంత్రి ఫొటో, లోగోకు అధికారులు పేపర్ అంటించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఉమాపతి, రమేష్‌నాయుడు ఈ నెల 17వ తేదీన అధికారులు అంటించిన పేపర్లను చించివేయడంతోపాటు లోగోను ధ్వంసం చేసినట్లు మార్కొండయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో సుమారు రూ.30వేల నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం


కాలిపోతున్న స్కూటర్

సదుం: మండలంలోని చెరుకువారిపల్లెకు చెందిన సతీష్ రెడ్డి భార్య శ్రీనిత్య నడుపుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్ సోమవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. సదుం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా నడిగడ్డ సమీపంలో స్కూటర్‌లో పొగరావడం గుర్తించి నిలిపేసింది. మంటలు చెలరేగి స్కూటర్ పూర్తిగా కాలిపోయింది. స్కూటర్ కొని రెండేళ్లు అయ్యిందని, అప్పటి నుంచే మొరాయిస్తుండటంతో కంపెనీ ప్రతినిధులకు సైతం ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఇటీవలే కొత్త బ్యాటరీ మార్చారని, అయినా ఇప్పుడు ఇలా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

రేణిగుంట : మండలంలోని పుత్తూరు మార్గం అత్తూరు రోడ్డు సమీపంలోని ఓ దాబా వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వృద్ధుడిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాలకు తరలించినట్లు గాజులమండ్యం ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్

చిత్తూరు అర్బన్: నగరంలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంగణాల్లో చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ తనిఖీలు చేశారు. రాజకీయ పోస్టర్లు, బ్యానర్లను తొలగింపజేశారు. పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నేమ్ బోర్డులపై ఉన్న ముఖచిత్రాలపై తెలుపు స్టిక్కర్లు అతికించారు. శిలాఫలకాలను మూసి ఉంచారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణాలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీటి ప్లాంట్ల వద్ద ఉన్న స్టిక్కర్లను తొలగింపజేశారు. ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. నగరంలో ఎక్కడా రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు ఉండరాదని అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా వీటిని ఏర్పాటు చేస్తే తక్షణం చర్యలు తీసుకోవాలని, అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలుపై వార్డుల్లో నిరంతరం నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జ్ ఎంహెచ్‌వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రంజాన్ మాసం సందర్భంగా నగర పరిధిలోని మసీదుల వద్ద పారిశుధ్యం, నీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సంతపేట, హైరోడ్‌లోని మసీదులను సోమవారం పరిశీలించిన కమిషనర్, నిర్వాహకులతో మాట్లాడారు. నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. మసీదు ఆవరణల్లో పారిశుధ్య మెరుగ్గా ఉంచాలని, తగినంత నీటి సరఫరా చేపట్టాలని అధికారులకు సూచించారు. రంజాన్ మాసంలో ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మసీదు ఆవరణలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

సారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ గోరివంక వద్ద సోమవారం సారా తయారు చేస్తున్న నల్లగుట్ట పల్లె దళితవాడకు చెందిన రవి, వెంకటరమణ అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవి ప్రకాష్ తెలిపారు. నిందితుల నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు


బైరెడ్డిపల్లెలో..

- ఇద్దరు నిందితుల అరెస్ట్

చిత్తూరు అర్బన్ : జిల్లాలో వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు...చిత్తూరు సమీపంలోని కాణిపాకం బైపాస్ వద్ద ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్న ఎ.గిరిధర్ (26) అనే వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ.20 వేల విలువైన కర్ణాటక మద్యం, రూ.50 వేలు విలువైన స్కూటర్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉలసయ్య వివరించారు.

బైరెడ్డిపల్లె : మండలంలోని దేవదొడ్డి–తీర్థం రహదారిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గంగవరం మండలం గండ్రాజుపల్లె పంచాయితీ సరమట్లపల్లె గ్రామానికి చెందిన చెన్నారెడ్డి, బైరెడ్డిపల్లె మండలం మేకలనాగిరెడ్డిపల్లెకు చెందిన చోటు అలియాస్ హసన్‌బాషా కారులో 1,920 టెట్రా ప్యాకెట్లు తీసుకువస్తూ పట్టుబడ్డారు. వీరిలో హసన్‌బాషా పరారయ్యాడు. రూ.77వేల విలువైన మద్యం, కారును సీజ్ చేసినట్లు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.